


www.jananinadam.com

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.

**సంప్రదించాల్సి నెంబర్**

**9550100197,9490111460**

సంపుటి: 1 సంచిక: 285 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | శుక్రు వారం 23-05- 2025 | పేజీలు : 8 | వెల : రూ.2.00



## అమెరికాలో ఇజ్రాయెల్ ఎంబసీ సిబ్బంది దారుణ హత్య

- జ్యూయిష్ మ్యూజియం సమీపంలో బుధవారం సాయంత్రం ఘటన
- హెూంలాండ్ సెక్రటరీ, ఎఫ్‌బీఐ డైరెక్టర్ దిగ్భ్రాంతి, దర్యాప్తునకు ఆదేశం
- ఘటనను తీవ్రంగా ఖండించిన ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి

వాషింగ్టన్ : అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో బుధవారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) దారుణం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి చెందిన ఇద్దరు సిబ్బందిని దుండగులు కాల్చి చంపారు. నార్త్‌వెస్ట్ డీసీలోని ఎఫ్‌బీఐ వాషింగ్టన్ ఫీల్డ్ ఆఫీస్‌కు సమీపంలో ఉన్న జ్యూయిష్ మ్యూజియం వద్ద ఈ కాల్పుల ఘటన జరిగింది. ఈ ఘటనను అమెరికా హెూంలాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ధృవీకరించారు. కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని ఆమె తెలిపారు.

2వ పేజీలో...





జయపుర,మే22: మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మన భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని అన్నారు. రాజస్థాన్‌లో పర్యటిస్తున్న సందర్భంగా బికనీర్‌లో ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. ఉద్వేగపూరితంగా ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు.

- ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం
- సిందూరం తుడిచిన వాళ్లకు ఆపరేషన్ సిందూర్‌తో జవాబిచ్చాం
- ఉగ్రవాదులను ఉసిగొల్పితే ఇక అంతే సంగతలు
- మరోమారు పాక్‌ను హెచ్చరించిన ప్రధాని మోడీ
- రాజస్థాన్ బికనీర్ వేదికగా పలు స్టేషన్లకు వర్చువల్‌గా ప్రారంభం

## పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం

2వ పేజీలో...



2వ పేజీలో...

## పాక్ నిఘా కార్యకర్తలతో సంభాషణ

ఉగ్రవాదులతో లింక్ మాత్రం లేదు యూట్యూబర్ జ్యోతి కేసులో పోలీసుల విశ్లేషణ

న్యూఢిల్లీ,మే22 :యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు ఉపశమనం లభిస్తోంది. పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో జ్యోతి సంప్రదింపులు జరిపిందని, అయితే, ఉగ్రవాదంతో ఆమెకు ఎటువంటి సంబంధాలు లేవని పోలీసులు తేల్చారు. జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో తెలిసి సంభాషించినప్పటికీ, ఆమెకు ఉగ్రవాద కార్యకలాపాలు లేదా గ్రూపులతో సంబంధం ఉందని ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, సాయుధ దళాల గురించి లేదా వారి ప్రణాళికల గురించి మల్హోత్రాకు ఎటువంటి అవగాహన లేదని హిసార్ పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు.



2వ పేజీలో...

## బిజెపి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

కరీంగనర్,మే22 : గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.

- కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి ఇందుకు నిదర్శనం
- అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునీకరణ
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్



2వ పేజీలో...

## నాంపల్లి కోర్టుకు రేవంత్ హాజరు

హైదరాబాద్, మే 22: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాంపల్లి కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల విచారణ నిమిత్తం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు ఇవాళ హాజరయ్యారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరు కావడం ఇది రెండోసారి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రిజర్వేషన్లపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించి హైదరాబాద్ బేగంబజార్, నల్గొండ టూ టౌన్, మెదక్ జిల్లా కౌడిపల్లి పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో వ్యక్తిగతంగా న్యాయమూర్తి ముందు హాజరైన రేవంత్ రెడ్డి తన వాదనను వినిపించారు. తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని, పోలీసులు చెబుతున్నవి అవాస్తవాలని కోర్టుకు తెలిపారు. తాను ఎక్కడా ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసుకుంది. ఈ కేసుల్లో జూన్ 12న నాంపల్లి స్పెషల్ కోర్టు తీర్పు ప్రకటించనుంది. ముఖ్యమంత్రి కోర్టుకు హాజరుకావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు హాల్ దగ్గరకు ఇతరులను అనుమతించలేదు. ఈ కేసులు నమోదైన సమయంలో రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నారు. ఇదిలా ఉండగా.. గతంలో కూడా ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. ఏప్రిల్ 2024లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల విచారణ నిమిత్తం ఆయన నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు.



## తాను ఎంపిగా ఉన్నప్పుడు స్టేషన్ అభివృద్ధికి పట్టుబట్టా

నేటికి అది సాకారమయ్యిందన్న మంత్రి పొన్నం

తిరుపతికి రోజూ రైలు సర్వీస్ నడపాలని వినతి

కరీంనగర్,మే22 : తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆనాటి రైల్వే శాఖ మంత్రి మమతా బెనర్జీ ఉన్నప్పుడు కరీంనగర్ ఈ స్టేషన్ ను మార్పు చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో 103 స్టేషన్ లలో తెలంగాణ నుండి కరీంనగర్, వరంగల్, బేగంపేట రైల్వే స్టేషన్ లను పునరాభివృద్ధి చేసి ప్రారంభం చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి చెందిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ను వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యం కోసం అధునాతన సౌకర్యాలతో పునరభివృద్ధి చేసుకొని ప్రారంభం చేసుకున్నామని,

2వ పేజీలో...

## పంచాయితీలను ఆర్థికంగా ఆదుకోవాలి

హైదరాబాద్,మే22: పంచాయితీరాజ్ చట్టాన్ని బలోపేతం చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కులవృత్తులను,గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొదిస్తే తప్ప మార్పు కానరాదని పలువురు ప్రముఖులు చెబుతున్నారు. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని అంటున్నారు. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమాలను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. పల్లెల్లో ఏ పనులు చేయాలో సిఎం స్థాయిలో అధికారుల పర్యవేక్షణలోనే సాగుతోంది. గ్రామాల్లో సర్పంచ్‌ల బాధ్యత నామమాత్రంగా ఉంటోంది. వారికి బాధ్యత అప్పగిస్తే పన్నుల వసూళ్ల మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్దంగా శిక్షించేలా చట్టం రూపొందించిన ప్రభుత్వం నిధుల కోసం కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో పన్నులు ఇతరత్రా రూపంలో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగితే తప్ప నిధులు సమకూరవు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామిలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది.




- సర్పంచ్‌ల బాధ్యతలను పెంచాలి
- గ్రామస్థాయిలో ఉపాధి పనులను జోడించాలి

# పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం


మొదటిపేజీ తరువాయి...



కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు. మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా మరియు హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద గ్రూపులతో అనుబంధంగా ఉన్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారతదేశం ఐక్యంగా ఉందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి 140 కోట్ల మంది భారతీయులను కదిలించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల గుండెపై దాడి చేశామన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నివ్వడంతోనే ఇదంతా జరిగిందని మోడీ చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు.. అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారని.. మతం ఆధారంగా వేరు చేసి.. మహిళల నుదిటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేశారని.. దానికి ప్రతీకారంగానే మన దళాలు వాళ్లను మట్టిలో పాతిపెట్టేశారన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హృదయాలను గాయపరిచారు.. అందుకే వాళ్లను ముక్కలు.. ముక్కలు చేశామని వెల్లడించారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల శిబిరాలు నాశనం అయినట్లు చెప్పారు. త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇక అణు బాంబుల భయానికి భారతదేశం వెనుకాడదని మరోసారి మోడీ స్పష్టం చేశారు.'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది. అణబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పాక్‌తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్‌కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు' అని గట్టి హెచ్చరికలు చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ కృషి జరుగుతోంది. ఈ దిశగా గత 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేశాం. భారత రైలు నెట్‌వర్క్ ఆధునికీకరిస్తున్నాం. వేగం, పురోగతికి వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రతీకలు అంటూ కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునర్నిర్మించిన దేశ్‌నోక్ స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే బికనేర్-ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే దేశ్‌నోక్‌లోని కర్ణిమాత ఆలయంలో పూజలు చేశారు. ఇక అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను రాజస్థాన్ నుంచి వర్చువల్‌గా మోడీ ప్రారంభించారు. కొత్త స్టేషన్లను జాతికి అంకితమిచ్చారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఏపీలోని సూళ్లూరుపేట అమృత్ భారత్ స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. యూపీలో 19, గుజరాత్‌లో 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్‌లో 8 అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. అంతకుముందు బికనీర్‌లోని కర్ణిమాత ఆలయాన్ని ఆయన సందర్శించారు. అమ్మవారికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారులు.. ప్రధాని మోదీకి అందజేశారు. అనంతరం బికనీర్ ఎయిర్ బేస్‌ను మోదీ సందర్శించారు. మరోవైపు బికనీర్ సమీపంలో పాలనా గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారిగా ప్రధాని మోదీ రాజస్థాన్‌లో పర్యటించారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సరిగ్గా నెల రోజులకు ప్రధాని మోదీ రాజస్థాన్‌లోని బికనీర్ ఎయిర్ బేస్‌ను సందర్శించడం గమనార్హం.

## పాక్ నిఘా కార్యకర్తలతో సంభాషణ

మొదటిపేజీ తరువాయి...



ఆమె కాంటాక్ట్‌లలో కొందరు పాకిస్తానీ నిఘా కార్యకర్తలని తెలిసినప్పటికీ, ఆమె వారితో టచ్‌లో ఉందని ఆయన అన్నారు. 'ఇప్పటివరకు, ఆమె ఏదైనా ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నట్లు లేదా ఏదైనా ఉగ్రవాద సంస్థతో ఆమె అనుబంధానికి సంబంధించిన ఆధారాలు మాకు దొరకలేదు. ఆమె ఏదైనా ఖఎక్షలను వివాహం చేసుకోవా లనుకుంటున్నట్లు లేదా మతం మార్చుకోవాలనుకుంటున్న ట్లు చిత్రీకరించే ఏ పత్రాన్ని మేము కనుగొనలేదు' అని ఎస్పీ చెప్పారు. మల్హోత్రాకి చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు, వీటితోపాటు, మే 18న అరెస్టయిన వీసా ఏజెంట్ హర్కిరత్ సింగ్‌కు చెందిన రెండు మొబైల్ ఫోన్‌లను విశ్లేషణ కోసం ల్యాబ్స్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడించారు. 'జ్యోతి మల్హోత్రా ఐదురోజుల రిమాండ్‌లో ఆమెను కొన్ని కేంద్ర సంస్థలు విచారించాయి, కానీ ఆమె కస్టడీని మరే ఇతర ఏజెన్సీకి ఇవ్వలేదు. పబ్లిక్ డొమైన్‌లో వస్తున్నట్లు ఆమె 'డైరీ'లోని పేజీలు మా దగ్గర లేవు. తమ దగ్గర ఎటువంటి డైరీ లేదు,' అని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలా ఉండగా, 33 ఏళ్ల ట్రావెల్ బ్లాగర్ అయిన జ్యోతి మల్హోత్రాను మే 16న పాకిస్తాన్ కార్యకర్తలతో సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నారనే ఆరోపణలతో అరెస్టు చేశారు. ఆమెపై అధికారిక రహస్యాల చట్టం, 1923లోని సెక్షన్లు 3,5 ఇంకా భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 152 కింద కేసు నమోదు చేశారు. రిమాండ్ కాలంలో ఆమెను, జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు ప్రశ్నించారు.

## బిజెపి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

మొదటిపేజీ తరువాయి...

అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ. 1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ. 25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా రూ. 2 వేల కోట్లతో ఆధునీకరించిన 103 స్టేషన్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు. కరీంనగర్ స్టేషన్ కూడా వాటిలో ఒకటి. రూ. 27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో సదుపాయాలు కలిగిన ఈ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఏసీ/నాన్‌ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టాయిలెట్లు, సోలార్ ఎ÷-లాంట్ వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సెల్ఫీలు తీసుకునే స్థాయికి ఇది చేరిందని ఆయన తెలిపారు. గత 11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ. 42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ. 5,337 కోట్ల బ్జడెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తి-కరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

## పంచాయితీలను ఆర్థికంగా ఆదుకోవాలి

మొదటిపేజీ తరువాయి...

గ్రామాల పరిధిలో అన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చట్టసవరణ జరగాలి. ఎన్నికలకు ముందే ఇవన్నీ నిర్ధారించాలి. తెలుగు రాష్ట్రాల సిఎంలు ఇందుకు పూనుకోవాలి. గ్రామాల్లో జరిగే ప్రతి పని పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతాయి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న సర్కార్ నిర్ణయంతో గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలి. గ్రామాల నిధులు గ్రామాలకే చెందేలా చేయాలి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించేలా చేస్తే నిధుల దుర్వినియోగం తప్పుతుంది. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేస్తే పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. ఈక్రమంలో అధికారులు పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించుకోవాల్సిన అసవరం ఉంది. ఇలాచేస్తే కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏ పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి ఊరట కలుగనుంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించ వచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని పలువురు రాజకీయ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. దీనివల్ల పల్లెలు పరిశుభ్రంగా మారతాయి. పంచాయతీలకు ఆర్థికభారం తప్పుతుంది. గ్రామ పంచాయతీల్లో ఇదివరకే డంపింగ్ యార్డుల నిర్మాణ పనులను ఉపాధి కూలీలతో చేపడుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. అలాగే చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులతో ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

## నాంపల్లి కోర్టుకు రేవంత్ హాజరు

మొదటిపేజీ తరువాయి...

ఇది ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత కోర్టుకు హాజరుకావడం రెండోసారి. న్యాయమూర్తి వాంగ్మూలం రికార్డ్ చేసి తీర్పు రిజర్వ్ చేసిన అనంతరం రేవంత్ కోర్టు హాల్ నుంచి వెళ్లిపోయారు.

కాగా, సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు గతంలో పరువు నష్టం దావా వేశారు. భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన ఒక కాంగ్రెస్ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని వ్యాఖ్యానించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యాఖ్యలు బీజేపీ పరువుకు నష్టం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొంటూ.. కాసం వెంకటేశ్వర్లు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో పరువు నష్టం దావా వేశారు. కాసం వెంకటేశ్వర్లు తన ఫిర్యాదుతో పాటు, రేవంత్ రెడ్డి ప్రసంగానికి సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పింగ్‌లను కోర్టుకు సమర్పించారు. రేవంత్ రెడ్డిపై ఈ కేసు నమోదైన సమయంలో ఆయన తెలంగాణ పీసీసీ చీఫ్‌గా ఉన్నారు. రేవంత్ రెడ్డి తనపై నమోదైన ఈ పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ ఇటీవల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, హైకోర్టు కొన్ని సందర్భాల్లో రేవంత్ రెడ్డికి వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చినా.. ట్రయల్ కొనసాగింపును నిలిపివేయడానికి నిరాకరించింది.

## చినుకు పడితే... చిత్తడే

హైదరాబాద్: గడ్డిఅన్నారం కమలా నగర్ వాసుల వెతలు అంతా ఇంతా కావు.. నగరంలో మొగులైతే కాలనీ వాసుల గుండెల్లో గుబులు వెన్నులో ఒణుకు మొదలైతది.. వర్షం కురిసిందో కాలనీలో వరద..వర్షం ఎలిసిందో బురద.. గత ఇరవై ఏళ్ళ నుంచి గడ్డిఅన్నారం కమలా నగర్ వర్షపు నీటి వరద పోటెత్తగానే కాలనీలో కాలు కదిపే పరిస్థితి లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా కాలనీలో నడుముల లోతు వరద నీరు సరూర్ నగర్ శారదా నగర్ న్యూ గడ్డిఅన్నారం మీదగా కమలా నగర్ గల్లీలు అన్ని పోటెత్తాయని వరద ధాటికి కాలనిలో బైకులు, ఆటోలు, కార్లు కొట్టుకుపోయాయని తెలిపారు. ఇరవై ఏళ్ళ నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు దీనికి శాశ్వత పరిష్కారం చేయడం లేదని ఆరోపించారు. స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మాహేశ్వర్ రెడ్డి జి హెచ్ ఎం సి అధికారులకు సమస్యపై విన్నవించినా నిధుల కొరత పేరుతో పనులు పూర్తి చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం కమలానగర్ ,హైదరాబాద్ అంతా వరద నీరు తో బురదలో ఉంటే ప్రభుత్వం అందాల భామల సేవలకు జి హెచ్ ఎం సి సఫాయి కార్మికులను తీసుకెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మల్హోత్ర కథ చాలా ఉంది



న్యూఢిల్లీ, మే 22: హర్యానా పోలీసులు బుధవారం ఒక ప్రకటన చేశారు, యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా 2023 నుంచి ఒక పాకిస్థానీ అధికారితో సంబంధం కలిగి ఉందని. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి తెలిపిన విషయం ఏమిటంటే, గూఢచర్య అనుమానంపై అరెస్టు అయిన జ్యోతి నవంబర్ 2023 నుంచి పాకిస్థాన్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగి అహ్సన్-ఉర్-రహీం అలియాస్ దానిష్‌తో సంబంధం కలిగి ఉంది. దానిష్ గూఢచర్యంలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నందున మే 13న భారతదేశం అతన్ని బహిష్కరించింది. సూత్రధారుడు తెలిపిన విషయం ఏమిటంటే, పోలీసులు మల్హోత్రా మూడు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, ఇంటెలిజెన్స్ బ్యూరో, మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు జ్యోతిని విచారించారు. ఇప్పటివరకు ఆమె పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, మరికొన్ని దేశాలను సందర్శించిందని తెలిసింది. హిసార్‌కు చెందిన 33 ఏళ్ల జ్యోతి 'ట్రావెల్ విత్ జో' అనే యూట్యూబ్ ఛానెల్‌ను నడుపుతుంది. గత వారం న్యూ అగ్రసేన్ ఎక్స్‌టెన్షన్‌లో ఆమెను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన విషయం ఏమిటంటే, మల్హోత్రాపై ప్రభుత్వ రహస్యాల చట్టం, భారతీయ శిక్షాస్మృతి నిబంధనల కింద కేసు నమోదు చేశారు. గత రెండు వారాల్లో గూఢచర్య ఆరోపణలపై పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అరెస్టు చేసిన 12 మందిలో మల్హోత్రా ఒకరు. పోలీసుల ప్రకారం, ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రవాద దాడి తరువాత భారతదేశం, పాకిస్థాన్ మధ్య నాలుగు రోజులపాటు జరిగిన ఘర్షణ సమయంలో కూడా మల్హోత్రా దానిష్‌తో టచ్‌లో ఉంది. హిసార్ పోలీసులు ఆమె నుంచి మూడు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, మరికొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణ సందర్భంగా ఇటీవల పోలీసులు కురుక్షేత్రకు చెందిన ఒక వ్యక్తిని కూడా విచారించారు, అతను వీసా సలహా సేవలను అందిస్తున్నాడు. పోలీసులు అతని నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు ఇప్పటివరకు మల్హోత్రాకు ఏదైనా సైనిక లేదా రక్షణ సంబంధిత సమాచారం ఉందని చూపించే ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. ఆమె నాలుగు బ్యాంక్ ఖాతాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మల్హోత్రా పాకిస్థానీ గూఢచర్య సంస్థ అధికారిని వివాహం చేసుకుందని లేదా మతం మార్చుకుందని ఇప్పటివరకు ఎటువంటి ఆధారాలు లేవు. గూఢచర్య ఆరోపణలపై విచారణలో ఉన్న మరో యూట్యూబర్ నవనీకుర్ చౌదరి, ఏదైనా విచారణ సంస్థతో పూర్తిగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. చౌదరి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రోహ్తక్‌కు చెందిన చౌదరి, మల్హోత్రా పాకిస్థాన్ హైకమిషన్‌లో ఒక కార్యక్రమంలో అభిమానిగా తనను కలిసిందని అన్నారు. చౌదరి, "నేను ఆ రోజు ముందు జ్యోతిని వ్యక్తిగతంగా కలవలేదు. నేను ఆమెను అంతకు ముందు ఎప్పుడూ కలవలేదు." అని అన్నారు. 'యాత్రి డాక్టర్' అనే యూట్యూబ్ ఛానెల్‌ను నడుపుతున్న చౌదరి, 'ఎక్స్'లో ఒక వీడియోలో పాకిస్థాన్‌ను ఒకసారి మాత్రమే సందర్శించా నని అన్నారు. చౌదరి తండ్రి "మీడియా ట్రయల్ జరుగుతోంది. మా మొత్తం కుటుంబం సమస్యల్లో ఉంది. నేను బ్యాంక్ ఉద్యోగిని, కానీ దీనివల్ల నేను ఆఫీసుకు వెళ్లలేకపోతున్నాను. నేను, నా భార్య ఇద్దరం గత రెండు రోజులుగా ఏమీ తినలేదు." అని అన్నారు.

## అమెరికాలో ఇజ్రాయెల్ ఎంబసీ సిబ్బంది దారుణ హత్య

మొదటిపేజీ తరువాయి...

"ఇద్దరు ఇజ్రాయెల్ ఎంబసీ సిబ్బందిని దారుణంగా హత్య చేశారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటాం," అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, మరణించిన వారి వివరాలను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. కాల్పుల ఘటన గురించి సమాచారం అందిందని, బాధితుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నామని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ అన్నారు. మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఎంపీడీ)తో కలిసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కాల్పులు జరిగిన సమయంలోమ్యూజియంలో అమెరికన్‌జ్యూయిష్ కమిటీ(ఏజేసీ) ఆధ్వ ర్యంలో ఓ కార్యక్రమం జరుగుతోందని సమాచారం. ఈ దాడిని ఐక్య రాజ్యసమితిలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డనోన్ తీవ్రంగా ఖండిం చారు. ఇదిఅత్యంత హేయమైన యాంటీ-సెమిటిక్‌ఉగ్రవాద చర్య అని ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. ఫెడరల్‌స్థాయిలో సమగ్ర దర్యాప్తు జరుగుతుందని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. వాషింగ్టన్ డీసీ పోలీసులు ఘటనా స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, సాక్షులు, సీసీటీవీ ఫుటేజ్ కోసం గాలిస్తున్నారు.

## తాను ఎంపిగా ఉన్నప్పుడు స్టేషన్ అభివృద్ధికి పట్టుబట్టా

మొదటిపేజీ తరువాయి...

1267, 1268 నంబర్ ట్రైన్ కరీంనగర్ నుంచి తిరుపతి, తిరుపతి నుంచి కరీంనగర్ వెళ్ళే రైలు వారానికి రెండు రోజులు నడుస్తుంది దానిని ప్రతిరోజూ లేదా వారానికి నాలుగు రోజులు నడిచేలా చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను పొన్నం కోరారు. తిరుపతి రైలుకు ప్రయాణికుల రద్దీ బాగుండడంతో నిత్యం వెళ్లేలా చేస్తే చాలా బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ లో ఫర్టిలైజర్ లోడింగ్, అన్ లోడింగ్ హమాలీ సమస్యలను తొలగించామన్నారు. కరీంనగర్ నుంచి ముంబయి, షిర్డీలకు రైలు ప్రారంభిస్తే అందరికీ ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్కా కొమురయ్య పాల్గొన్నారు. కరీంనగర్ నుండి తిరుపతి వెళ్ళే వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును ప్రతిరోజు నడిచేలా మార్చాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపత్రం సమర్పించారు.

# జిల్లాలో 18 వేల 978 మంది రైతుల ఖాతాలలో 174 కోట్ల రూపాయల జమ

### జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి22:** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 318 కేంద్రాలు ద్వారా 18 వేల 978 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 41 వేల 266 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 174 కోట్ల 11 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 107 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం 21-05-2024 నాటి వరకు) కంటే ఈసారి 30 శాతం అధికంగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్., గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

# దళిత రైతులకు పహానీలు ఇవ్వాలి



**జననినాదం,జైనూర్,మే22:** ఏజెన్సీలో నివసిస్తున్న ఎస్సీ దళిత రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పహానీలు అందించాలని.డా.బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కాంబ్లె బాబాసాహెబ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో 70 సంవత్సరాల కాలం నుండి భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాజిస్తున ఎస్సీ దళిత రైతులకు పహానిలు అందించి బ్యాంకు రుణాలు అందజేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పరిష్కరించి దళితుల రైతులను ఆదుకోవాలని ఆయన పేర్కొన్నారు. గతంలో పహానిలు ఇచ్చేవారని పహానిలు ఇవ్వకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న దళిత రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు అందకుండా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు పహానీలు ఇచ్చి ప్రభుత్వపరంగా అందించే రైతు భరోసా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గుండెపోటుతో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత మృతి



**జననినాదం, జైనూర్,మే22:** జైనూర్ ఐసిడిఎస్ కార్యాలయంలో గ్రేట్ 2 సూపర్వైజర్ గా పనిచేస్తున్న సుజాత గుండెపోటుతో గురువారం మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. సూపర్వైజర్ సుజాత ఆసిఫాబాద్ నుండి జైనూర్ వైపు ఆర్టీసీ బస్సులో వస్తుండగా కెరామెరి సమీపంలో గుండెపోటు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించగా 108 వాహనంలో పైలట్ శ్రీనివాస్ సి పి ఆర్ చికిత్సలు చేసిన నయం కాలేదని తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారని బంధువులు తెలిపారు. గుండెపోటుతో సుజాత మృతి చెందినట్లు బంధువులు సమాచారం ఇచ్చారని సిడిపిఓ ఇందిరా తెలిపారు. సూపర్వైజర్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని సిడిపిఓ ఇందిరా అన్నారు. మృతి చెందిన సుప్రవైజర్ ది ఉటూరు మండలం శాంపూర్ పంచాయతీలోని గోదరి గూడకు చెందిందని గత జులై మాసంలో బదిలీపై సిడిపిఓ కార్యాలయం వచ్చిందని సిడిపిఓ ఇందిరా పేర్కొన్నారు. సిన్సియర్ గా విధులు నిర్వహించేదని ఆమె మృతి ఎంతో బాధాకరమని సిడిపిఓ తో పాటు కొందరు అంగన్వాడి టీచర్లు పేర్కొన్నారు.

# ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రధాన్యాత ఇవ్వాలి



**జననినాదం,జైనూర్,మే22:** ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ భూముల్లో (కందకాల) సోఫిట్ పనులు నిర్వహించాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిలు, ఈజీఎస్ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 350 ఇంకుడు గుంతల మంజూరుకు ప్రతిపాదనలు పంపమని రాగానే పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు.ప్రతి ఏడాది వేసవి కాలంలో నీటి ఎద్దడి నెలకొంటున్న సందర్భంగా గ్రామాల్లోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మిస్తే భూగర్భ జలాల్లో నీటి శాతం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలను పరిరక్షించాలని నర్సరీ లకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పనులపై దృష్టి సారించాలని ఆయన కోరారు. గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో పంచాయితీ కార్యదర్శిలకు కొ రారు. ఇందిరమ్మ ఇండ్ల, జన్ ధన్ లబ్ధిదారుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆయన కోరారు.తదితర విషయాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో జైనూర్ ఇన్చార్జ్ ఎంపీ ఓ మోహన్, ఈజీఎస్ ఏపీవో నగేష్, జైనూర్ మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్ కుమార్, జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఇన్చార్జిఇఓ పురుషంగ ఆనందరావు,పంచాయతీ కార్యదర్శులు,ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి22:** దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈ.డి. చాతరాజుల దుర్గాప్రసాద్, అధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం భాగ్యరెడ్డి వర్మ విశేష కృషి చేశారని అన్నారు. బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను రూపుమాపేందుకు పోరాటం చేశారని తెలిపారు. దళిత ఉద్యమ పితామహుడుగా, సంఘసంస్కర్తగా భాగ్యరెడ్డి వర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, సమాజంలో దళితుల చైతన్యం కోసం అహర్నిశలు శ్రమించారని తెలిపారు.మహనుభావుల జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, మహనీయుల చరిత్ర, త్యాగాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. దేశ భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం మహనీయులు ఆచరించిన మార్గాలను భావితరాలకు అందిస్తూ ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

## ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

### ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**జననినాదం,ఖానాపూర్ 22:** బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ఖానాపూర్ మార్కెట్యార్డ్లో తడిసిన ధాన్యాన్ని గురువారం ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్తో కలసికలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ..వరి రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షంతో ధాన్యం తడవడంతో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అధిక తూకంతో కొనుగోళ్లు జరిపితే సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ధాన్యం శుభ్రపరిచి, ఎండబెట్టే ఏర్పాట్లు చేయాలని, కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్షాలతో ధాన్యం తడవడం బాధకరమని, కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పూర్తిగా రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. అధిక తూకాలు వేయడం, తక్కువ ధరలకు కొనుగోలు చేయడం వంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్యార్డ్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, సివిల్ సప్లై డిఎం సుధాకర్, తహసీల్దార్ సుజాత, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోంది

### ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్



**జననినాదం,ఖానాపూర్ 22:** రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ...వారి సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బోజ్జు పటేల్ పేర్కొన్నారు.గురువారం ఖానాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్రే మిషన్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకై అంకితమవ్వాలని అన్నారు.డాక్టర్లు ఎప్పటికప్పుడు స్టోర్ రూంలో భద్రపరచిన మందులను పరిశీలించాలని అన్నారు.కొరత లేకుండా చూడాలన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం పని చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముందే కనిపించిన ఆరుద్ర పురుగులు..



రాజాపేట, మే 22: ఆరుద్ర కార్తె పేరు వినగానే మొదట గుర్తుకొచ్చేవి ఆరుద్ర పురుగులు వాతావరణం చల్లబడి, తొలకరి జల్లులు కురవగానే నల్లని నేలపై ఇవి ఎర్రని బొట్లుగా మెరుస్తూ కనిపిస్తాయి. అయితే ఈసారి కొద్దిగా ముందే వచ్చేశాయి. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చల్లటి వాతావరణానికి ఆరుద్ర పురుగులు వచ్చేశాయి. మామూలుగా ఇవి కనిపిస్తే వర్షాలు పుష్కలంగా కురుస్తాయని రైతుల నమ్మకం. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పలు గ్రామాల్లో తొలకరి వర్షం పలకరింపుతోనే అందమైన ఎర్రటి ఆరుద్ర పురుగులు నేలపై కనిపించాయి. ఆరుద్ర కార్తె రాకముందే పంట పొలాల్లో కనిపించడం శుభసూచకమని రైతులు అంటున్నారు. 20 రోజుల ముందే కనిపించడం వల్ల పంటదిగుబడి పెరుగుతుందని, ఇవి పంటలకు మిత్ర పురుగులని చెబుతున్నారు.

పర్యావరణ నేస్తాలు ఆరుద్ర పురుగులు: అందంగా కనిపించే ఆరుద్ర పురుగును కొన్నిచోట్ల పట్టు పురుగు, చందమామ పురుగు, లేడీ బర్డ్, ఇంద్రగోప పురుగు, కుంకుమ పురుగులు అని కూడా అంటారు. ఎవరు ఏ పేరుతో పిలిచినా ఈ పురుగు చూడటానికి ఎర్రని మఖ్మల్ క్లాత్ తో చేసిన బొమ్మలా ఉంటాయి. ముట్టుకోగానే అత్తిపత్తి ఆకుల్లా ముడుచుకుపోతాయ్. ఇంగ్లీష్ లో రెడ్ వెల్వెట్ మైట్ లేదా రెయిన్ బగ్ అని పిలిచే ఈ పురుగులు ఆకర్షణీయమైన ఎరుపు వర్ణంలో ఉంటాయి. ఇవి నేలను గుల్లబారకుండా చేసి పంటలకు పోషకాలు అందిచడంలో సహకరిస్తాయి. అందుకే వీటిని పర్యావరణ నేస్తాలు అంటారు. ఈ పురుగులు మట్టిలో గుడ్లను పెడతాయి. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో గుడ్లు అభివృద్ధి చెంది లార్వాలు జనిస్తాయి. పరిసరాలలో పూర్తిస్థాయి అనుకూల పరిస్థితుల్లో మాత్రమే గుడ్లు అభివృద్ధి చెందుతాయి. ప్రతికూల పరిస్థితులు ఉంటే గుడ్లు జీవాన్ని కోల్పోలాయి. ఇవి కొన్ని రకాల కీటకాలపై కొంతకాలంపాటు పరాన్నజీవులుగా ఉండి తిరిగి మట్టిలో చేరి ప్రౌఢదశకు చేరుకుంటాయి. వర్షాల రాకతో నేల నుంచి బయటకు వస్తాయి. ఎదిగిన ఆరుద్ర పురుగులు శీతాకాలంలో సుప్తావస్థలో ఉంటాయి. కొద్దికాలం మాత్రమే నేలపై కనిపిస్తాయి. ఆ సమయంలో ఆహారం, జత కోసం వెతుకుతాయి. ఆరుద్ర పురుగులు కనిపించడాన్ని రాబోయే వర్షాలకు సూచనగా భావిస్తారు. 'ఆరుద్ర'తో రైతుల కండ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. బీడువారిన నేలపై తొలకరి జల్లులు పడగానే బిలబిలామంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వచ్చేస్తాయి. దీంతో ఆ ఏడాది వర్షాలు ఎక్కువగా కురుస్తాయనీ.. రైతన్నలు చక్కగా వ్యవసాయం చేసుకోవచ్చని పెద్దలు చెబుతుంటారు. అలా ఆరుద్ర పురుగులు, రైతులకు అవినాభావ సంబంధం ఉంది. ఎర్రగా, బొద్దుగా చూడ ముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని రైతులు శుభసూచకంగా భావిస్తారు. ఇక వ్యవసాయం పనులు మొదలు పెట్టుకోవచ్చని ఆనందంగా పొలాలకేసి మళ్లుతారు.

# వర్షం వల్ల భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి ప్రతినిదిమే 22: కాళేశ్వరంలో బుధవారం సాయంత్ర కురిసిన అకాల భారీ వర్షం నేపథ్యంలో భక్తుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం వర్షంలో తిరుగుతూ సరస్వతి ఘాట్‌ను సందర్శించి వర్షం వల్ల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా రోడ్లపై పడిపోయిన ఫ్లెక్సీలు, బ్యానర్లు భక్తుల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. వర్షం కురిసే సమయంలో గోదావరి వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున భక్తులను త్రివేణి సంగమ నదిలోకి వెళ్లకుండా నియంత్రణ చేయాలని అధికారులకు సూచించారు. ఒక్కో రూటులో ఒక ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి పడిపోయిన ఫ్లెక్సీలను తొలగించాలని భక్తులు, పౌరులు ఇబ్బంది పడకుండా పంచాయతీ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో జాగ్రత్తలు పాటించాలని, వర్షంతో రహదారులు చిత్తడిగా మారినందున నీటి నిల్వలు లేకుండా వాహనాలు వెళ్ళడానికి వీలుగా స్టోన్ డస్ట్ వేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ఏరియా లలో వాహనాలను అనుమతించడం వల్ల బురదలో చిక్కుకునే ప్రమాదం ఉందని భక్తులు గమనించాలని



తెలిపారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తక్షణమే శుభ్రం చేయాలని, అవసరమైన చోట తాత్కాలిక మార్గాలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. భక్తులకు అత్యవసర సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఆసాంతం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వర్షాల సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, డిఆర్డిఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాల్లో 8వ రోజు భక్తుల రద్దీ



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి మే 22: సరస్వతి నదీ పుష్కర మహోత్సవాల్లో భాగంగా గురువారం 8వ రోజు భక్తుల రద్ది ఘనంగా కొనసాగుతోంది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున మన రాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. పుణ్యస్నానాలు, ప్రత్యేక పూజలు, హారతులతో ఘాట్‌ల పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగుతున్నాయి. భక్తులు అమ్మవారి దర్శనార్థం బారీ క్యూలైన్లలో నిలబడి భక్తిని చాటుకుంటున్నారు. పుష్కర స్నానానికి భద్రతా దళాలు, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది సహా వాలంటీర్లు సమర్థంగా సేవలందిస్తున్నారు. భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, అధికారులు అదనపు ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, నీటి సరఫరా, వైద్య సహాయ కేంద్రాలు, విస్తృతంగా అందుబాటులో తెచ్చారు. పుష్కరాల ముగింపుకు ఇంకా 4 రోజులు సమయం ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అన్ని ఏర్పాట్లు లో నిమగ్నమయ్యారు. భక్తులు పుష్కరాల్లో పాల్గొనాలని, సూచించిన మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు.

# రైతులకు పచ్చిరొట్ట, జిలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**రైతు పక్ష పార్టీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పాయం!**

**ఎమ్మెల్యే పాయం కి ఘన స్వాగతం పలికిన వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు**



అశ్వాపురం మే 22: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం నెల్లిపాక గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన పచ్చిరొట్ట,జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన పినపాక ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతీ ప్రభుత్వం అని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వం అని తెలిపారు. దేశం లో ఎక్కడ లేని విదంగా ఒక్క తెలంగాణ రాష్ట్ర%శీ% లోనే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు బట్టి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, పొంగులేటి మరియు రాష్ట్ర మంత్రుల ఆధ్వర్యంలో రైతు సోదరులకు అద్భుతమైన పథకాలు అందిస్తుంది అని తెలియజేసిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఈ యొక్క కార్యక్రమంలో %ADA% తాతారావు,సొసైటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,%AO% చటార్జి రమాదేవి,%CEO AO% వెంకట్,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# రైతులకు అందుబాటులో పచ్చి రొట్ట



కమాన్ పూర్ మే 22 కమాన్ పూర్ మండలంలోని రైతులకు పచ్చి రొట్ట అందుబాటులో ఉంది అని వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చి రొట్ట అయినటువంటి జిలుగలు రావడం జరిగిందని 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రైతుకు 2138 రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. ఇట్టి విత్తనాలు అవసరమున్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం నంబరు మరియు ఆధార్ కార్డు నెంబరు తీసుకొని సంబంధిత క్లస్టర్ విస్తీర్ణ అధికారి ద్వారా పర్మిట్ పొందాలని పేర్కొన్నారు. అట్టి పర్మిట్ సహాయంతో కమాన్ పూర్ లోని డీసీఎంఎస్ గోదాంలో మరియు డీసీఎంఎస్ గుండారం ఏ ఆర్ ఎస్ కె కమాన్ పూర్ లో డబ్బులు చెల్లించి విత్తన బస్తాలను తీసుకెళ్లాలని కోరారు.

# ఆర్టీసీ డ్రైవర్ పై ఆటో డ్రైవర్ దాడి

హైదరాబాద్: మియాపూర్ ఆల్విన్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్ డ్రైవర్ పై దాడికి ప్రయత్నం జరిగింది. సోషల్ మీడియాలో వీడియో వైరల్ గా మారింది. కాచిగూడ నుండి పటాన్చెరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లో మియాపూర్ ఆల్విన్ చౌరస్తా వద్ద ఘటన జరిగింది. తన ట్రాన్స్పోర్ట్ ఆటోకు దారి ఇవ్వడం లేదంటూ బస్సును ఆపి డ్రైవర్ ఫోన్ లాక్కొని ఆటో డ్రైవర్ దాడికి ప్రయత్నించాడు. రన్నింగ్ లో ఉన్న బస్సు ఎక్కి కిటికీ బయట నుండి డ్రైవర్ ను బస్సు తోలనివ్వకుండా చెయ్యి పట్టుకుని తాళాలు లాగే ప్రయుత్నం చేసాడు ఆటో డ్రైవర్.బస్సులోని ప్రయాణికుల చొరవతో వివాదం సద్దుమణిగింది.

# మూగజీవలకు నివాస ప్రాంతాలు గా శంకర్ పల్లి కూరగాయల మార్కెట్



శంకర్పల్లి : మే 22 : శంకర్పల్లి మండలం కూరగాయల మార్కెట్లో నాబోర్డ్ నిధులద్వారా నిర్మించిన శంకర్పల్లి వ్యవసాయ మార్కెట్లోని కూరగాయల వ్యాపారస్తులు వాటిని సద్వినియోగం చేసుకోక పోవడం ద్వారా అవి కేవలం మేకల కు నివాస ప్రాంతం గా మారాయి కూర గాయల వ్యాపారస్తులు వాటిని సరిగ్గా సద్వినియోగం చేసుకోవడం లేదు రాబోతున్న వర్షా కాలం వీటి వలన నీటి సరఫరా వల్ల చెత్త కూరడంతో పరిసర ప్రాంతాల దుకాణదారులకు దుర్గంధం వలన అనారోగ్య పాలయ్యే సూచనలున్నాయి చినుకు పడుతే మార్కెట్ అంతా బురద మయం మరియు పబ్లిక్ టాయిలెట్స్‌ని కలెక్షన్లు గృహస్థుల డ్రైనేజ్ వ్యవస్థలో కలపడం వల్ల దుర్గంధంతో వాసన వలన చుట్టూ ఉన్న దుకాణదారులు మరియు సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు చుట్టు పక్కల నివాస ప్రంతాలు ఉండటం వలన దోమలు వ్యాప్తి జరిగే అవకాశం ఎక్కువగా ఉంది స్థానిక మునిసిపల్ అధికారులు స్పందించి వ్యాపారతులకు అవగాహన కల్పించి మేకలను మరొక ప్రంతానికి తరలించి ఆ షెడ్యూల్ లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని స్థానికులు కోరుకుంటున్నారు

# బహిర్గతం చేయరాని విషయాలపై వ్యాఖ్యలా?

దేశ సార్వభౌమాధికార విషయంలో ఏ పార్టీ అయినా ఒక్కటిగా ఉండాల్సిందే. అంతర్జాతీయ విషయాల్లో ఏకముఖంగా సాగాలి. ఇటీవలి పాక్‌తో కాల్పుల ఘటనకు సంబంధించి అందరూ ఒక్కతాటిపైనే ఉన్నట్లు కనిపించినా మెల్లగా స్వరం మారుస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తీరు అనుమానాస్పదంగా ఉంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల వ్యాఖ్యలు రక్షణ దళాల సమర్థతను శంకించేలా ఉన్నాయి. నిజానికి పహల్గామ్ దాడి తరవాత కూడా పిచ్చికూతలు కూసిన వారి వ్యాఖ్యలను పాకిస్థాన్ రికార్డు చేసి, వాటిని ప్రపంచ దేశాల ముందుంచింది. పహల్గామ్ దాడి విషయంలో హిందువువేనా అని నిర్ధారించుకుని కాల్పులు జరిపారు. దీనిపై కొందరు నేతలు అవాకులు చవాకులు పేలారు. అదంతా ఉత్తిదేనని, అలాంటిదేమీ జరగేలదని కొందరు అన్నారు. ఇప్పుడేమో ఖర్గే, అసలది యుద్దమే కాదు..చిన్న యుద్దమే అంటూ దీరాలు తీస్తున్నారు. రాహుల్ మాత్రం మనవి ఎన్ని విమానాలు కూలాయని ఆరా తీస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలు. అనుమానాలు ఉంటే రక్షణశాఖ అధికారులను కలిసి తెలుసుకోవచ్చు. అలాగే తెలుసుకున్న సమాచారాన్ని గుట్టు చప్పుడు కాకుండా కాపాడుకోవాలి. తాజాగా జరిగిన భారత్-పాకిస్తాన్ ఘర్షణలతో అర్ధాంతరంగా రెండు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకోవడం వెనక కారణాలు చెప్పాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ తదితర పార్టీల తీరు కేవలం పాక్‌కు మాత్రమే అనుకులంగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ఇది చిన్నపాటి యుద్దమేనని, కాల్పులు ఎందుకు ఇరమించారని నిలదీస్తున్నారు. మనవి ఎన్ని విమానాలు కూలాయని రాహుల్ అంటున్నారు. శశిథరూర్‌ను విదేశీశాకు వెళ్లే బృందందలో ఎంపిక చేస్తే తట్టుకోవడం లేదు. గతంలో ఐక్యరాజ్యసమితిలో పనిచేసిన అనుభవం థరూర్‌కు ఉంది. ఇకపోతే అమెరికా తీరు కూడా అనుమానాస్పదంగా ఉంది. పాక్, భారత్ ఘర్షణలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అకస్మాత్తుగా తామే రెండు దేశాలను ఒప్పించి, కాల్పుల విరమణకు దోహదం చేశామని చెప్పుకోవడం ..తరవాత నా ప్రమేయం లేదనడం వంటివన్నీ చూస్తున్నాం. అయితే ఇందులో అమెరికా ప్రమేయం లేదని భారత్ పదేపదే స్పష్టం చేస్తూ రావడం గమనిస్తే తెరవెనుక చీకటి రహస్యాలు దాగి ఉన్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. ముందురోజు కూడా ఈ ఘర్షణ విషయంలో జోక్యం చేసుకోనని చెబుతూ వచ్చిన అమెరికా అంత అకస్మాత్తుగా ఎందుకు కాల్పుల విరమణ జరపాలని రెండు దేశాలపై ఒత్తిడి తెచ్చిందన్నది కూడా ముఖ్యమే. ఇజ్రాయిల్‌ను, రష్యాను ఇలాంటి సందర్భాల్లో ఒత్తిడి చేయలేక పోయింది. తన మాట వినకపోతే వాణిజ్య సంబంధాలు నిలిపివేస్తామని బెదిరించడంతో రెండు దేశాలు దారికి వచ్చాయని స్వయంగా డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం గమనార్హం. ఇదే సమయంలో పాకిస్తాన్ అణుస్థావరం అని చెబుతున్న కిరానా హిల్స్ వద్ద భారత్ వైమానిక దళం క్షిపణులు ప్రయోగించడంతో అణుధార్మికత లీకేజీ జరగడంతో అమెరికా రంగంలోకి దిగి ఒత్తిడి తెచ్చిందనే ప్రచారం కూడా జరుగుతోంది.అయితే, అక్కడ అణుస్థావరం ఉన్నట్లు తమకు తెలియదని, ఆ ప్రాంతంలో అసలు తాము క్షిపణులనే ప్రయోగించలేదని భారత వైమానిక దళాధికారి స్పష్టం చేశారు. కిరానా హిల్స్ లో ఎలాంటి లీకేజీ జరగలేదని 'ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఎమ్జర్గ÷న్సీచెబుతోంది. అసలు కిరానా హిల్స్‌పై వస్తున్న వార్తలపై పాకిస్తాన్ ఎందుకు మౌనం పాటిస్తోంది? దాయాది దేశం కిరానా హిల్స్ విషయంలో ఏమైనా దాచిపెడుతుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగించ డానికి సిద్ధమవుతుండగా, కట్టడి చేసేందుకు భారత్ క్షిపణి ప్రయోగించిందనే కథనాలు కూడా వెలువడ్డాయి.అణుదాడుల గురించి దాయాది దేశం నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తాజాగా తేల్చి చెప్పారు. బరోవైపు పాక్ అణుదాడి హెచ్చరికలను ప్రధాని మోడీ కూడా కొట్టిపారేశారు. ఇలాంటి హెచ్చరికలతో భారత్‌ను బెదరించలేదరని అన్నారు. కిరానా హిల్స్ ప్రాంతంలో అణ్వస్త్రాల స్థావరం ఉందని, రెండు దేశాల ఘర్షణ ఆ ప్రాంతానికి ఎక్కడ విస్తరిస్తుందో అన్నభయంతోనే కాల్పుల విరమణ జరిగే విధంగా రెండు దేశాలకు అమెరికా నచ్చచెప్పే ప్రయత్నం చేసిందని భావించాల్సి వస్తుంది. ఆ ప్రయత్నం కూడా రష్యా- ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల మాదిరిగా సుదీర్ఘంగా చర్చలతో కాలయాపన చేయకుండా తక్షణమే అమలులోకి వచ్చే విధంగా ప్రయత్నం జరిగిన్నట్లు స్పష్టం అవుతుంది. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో ఈ ఘర్షణలతో జరిగిన దాడులు, నష్టాల వివరాల గురించి పలువురు ఎంపిలు ప్రశ్నించగా 'జాతీయ భద్రత' దృష్ట్యా అటువంటి వివరాలు వెల్లడించ లేమని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొనడం గమనార్హం. ఏదేమైనా ఇటీవల చోటు చేసుకున్న భారత్ పాకిస్థాన్ ఘర్షణలకు సంబంధించి ప్రభుత్వ వాదనను విశ్వసించాల్సిందే. ఇందులో ఈకలు పీకాల్సిన పనిలేదు. గతంలో ఇందిర చేసిందే యుద్దం.,.మోడీ యుద్ధం ఏమీ చేయలేదనడం కూడా సరికాదు. కాంగ్రెస్ నేతలు ఆచితూచి మాట్లాడితే మంచిది. దేశం ముందు అంతా సమానమే. మన భద్రత, సార్వభౌమాధికారం కూడా ముఖ్యమే. ఇలాంటి సమయంలో అనవసర వ్యాఖ్యలు చేసి ప్రపంచం ముందు మనలను మనం చులకన చేసుకోరాదు. ఈ విషయంలో ఖర్గే , రాహుల్ తదితరులు సంయమనం పాటించాలి. అతిగా మాట్లాడి పాకిస్థాన్‌కు ఉప్పందించే ప్రయత్నం చేయరాదు.

# శ్రీధర్ బాబును కలిసిన ఐ ఎన్ టి యు సి నేతలు



మంథని ప్రతినిధి,మే 22:తెలంగాణ సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్లు, పరిశ్రమలు, వాణిజ్యం , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును ఆర్జి టు ఐఎన్టీయూసీ భదావత్ శంకర్ నాయక్, ఐఎన్టీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాలిగమ మల్లేష్ లు గురువారం మర్యాదపూర్వకంగా గత కొద్దిరోజులుగా కాలేశ్వరం పుష్కరాలను పురస్కరించుకొని పుష్కర పనులను అన్ని తానై దగ్గరుండి పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసినదే. ఈ క్రమంలోనే గురువారం తన స్వగ్రామమైన ధన్వాడలో రాత్రి బస చేశారు. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి మంత్రిగారిని ఆహ్వానించడానికి ఐఎన్టీయూసీ నాయకులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఐ ఎన్ టి సి నాయకులు కాలేశ్వరం పుష్కరాలను అత్యంత విజయవంతంగా నిర్వహిస్తున్నందున మంత్రి గారిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినట్లు వారు తెలిపారు.

# పత్తాలేని జీలుగ విత్తనాలు

నేరేడుచర్ల, మే 22 : వానకాలం సమీపిస్తున్నది. కానీ జిల్లాకు అవసరమైన జీలుగ విత్తనాలు ఇప్పటి వరకు రాలేదు. మరో రెండు వారాల్లో వరి సాగు చేసే రైతులు జీలుగ కోసం ఎదురు చూస్తున్నారు. సరఫరా ఆలస్యమైతే సాగు కూడా వెనుకబడుతుందని వారు వాపోతున్నారు. ఎందుకంటే విత్తనాలు చల్లిన 40 రోజులకు పెరిగిన జీలుగ మొక్కలను కలియదున్నాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వరినాట్లు వేసుకోవాలి. జీలుగ విత్తనాలు చల్లడానికి సరైన సమయ ఇదేనని రైతులు అంటున్నారు. కానీ వ్యవసాయ శాఖ మాత్రం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఇంకా విత్తనాలు తెప్పించే పనిలోనే ఉంది. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయానికి పెద్ద పీట వేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సీజన్ ప్రారంభానికి ముందే తెప్పించి సిద్ధంగా ఉంచేది. ప్రస్తుత కాంగ్రెస్



పాలనలో సరైన ప్రణాళిక లేక పోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. సూర్యాపేట జిల్లాలోని రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలను సరఫరా చేయడంలో వ్యవసాయ శాఖ విఫలం చెందుతున్నది. జిల్లాకు 7వేల క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అవసరం అని ప్రతిప్రాదనలు పంపించారు. కానీ గత సంవత్సరం 900 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని, ఈ సారి కూడా 1500 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయని అధికారులు తెలుపుతున్నారు. గత వానకాలంలో జిల్లాలో 4,85,064 ఎకరాల్లో వరి సాగు కాగా ఈ సారి సీజన్‌లో 4,85,125 ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు 7 వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ రాష్ట్ర శాఖకు ఇండెంట్ పంపింది. వాస్తవానికి మే మొదటి వారంలోనే జిల్లాకు ఈ విత్తనాలు సరఫరా కావాలి. కానీ ఇంత వరకూ జిల్లాకు చేరలేదు. మరో పది పదిహేను రోజులు సమయం పట్టే పరిస్థితి కనిపిస్తున్నది. వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు పంపేది కొండంత అయితే అక్కడి నుంచి వచ్చేది మాత్రం గోరంతే అని పలువురు విమర్శిస్తున్నారు. నేరేడుచర్ల వ్యవసాయ అధికారులు మండలానికి 400 క్వింటాళ్లు జీలుగ విత్తనాలు అవసరం అని



ప్రతిప్రాదనలు పంపించగా కేవలం 70 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపినట్లు తెలిసింది. వచ్చిన విత్తనాలు ఒక్కరోజు కూడా రావని, కార్యాలయానికి వచ్చే రైతులకు ఏ సమాధానం చెప్పాలని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు రైతుల గోసను అర్థం చేసుకొని కావాల్సిన విత్తనాలను సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు. సబ్సిడీపై స్పష్టత లేదు: నేలకు, పంటకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువును తయారు చేసేందుకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వస్తున్నది. పట్టాదారు పుస్తకం ఉన్న రైతుకు మాత్రం 50 శాతం వరకు సబ్సిడీపై అందజేస్తుంది. ఈ సారి వానకాలం ఎంత సబ్సిడీపై విత్తనాలు అందజేస్తారనే దానిపై ఇంత వరకు స్పష్టత లేదు. గతంలో ఇచ్చిన విధంగానే 50 శాతం తగ్గకుండా ఇస్తారని అధికారులు పేర్కొంటున్నారు.జీలుగ విత్తనాలు జిల్లాకు వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సబ్సిడీ ఖరారు అవుతుందని, ఎన్ని సెంటర్లలో పంపిణీ చేస్తామనే విషయం తెలుస్తుంది.

# మహిళా సంఘాలు ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ పథకాల పై మహిళ సంఘాల సభ్యులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష త జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాలపై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేం దుకు వీలుగా ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి ప్రోగ్రాం క్రింద ప్రతి సంవత్సరం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ వివిధ వ్యాపార, వాణిజ్య రంగాల్లో మహిళలు రాణించాలని కలెక్టర్ సూచించారు. మహిళల సంక్షేమం కోసం వివిధ ప్రభుత్వ శాఖలు చేపట్టిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమా లపై అవగాహన కల్పించేందు కు మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు పథకాల పై వివరాలతో కూడిన బుక్ లెట్ అందించామని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలతో పాటు రాజీవ్ యువ వికాసం, ఎస్సి సబ్ ప్లాన్, కేంద్ర ప్రభు త్వం అందించే పిఎంఈజిపి, పిఎంఎఫ్ఎంఈ వంటి వివిధ పథకాలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక యూనిట్ స్థాపనకు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. హార్టికల్చర్, వ్యవసాయ శాఖ లేదా ఇతర వాణిజ్య కార్యకలాపాల రూపకల్పన పై ఎటువంటి సందేహాలు ఉన్నా అధికారులు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన పెంచుకోని, వీటి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. త్వరలో మండల స్థాయిలో కూడా మహిళా సంఘాలకు ప్రభుత్వ పథకాల పై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, డి డబ్ల్యు ఓ, వేణుగోపాల్, జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, డిఎంహెచ్. ఓ .డా. అన్న ప్రసన్న కుమారి, బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ వినోద్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల కొంగు బంగారం శ్రీ ఆంజనేయ స్వామి

**-ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు**

**-భక్తులతో కిటకిటలాడిన అంజన్న ఆలయాలు**

మంథని ప్రతినిధి, మే 22: భక్తుల కొంగు బంగారం శ్రీ ఆంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాలు సంవత్సరంలో రెండు సార్లు నిర్వహించడం సంప్రదాయబద్ధంగా వస్తుంది. ఒకటి శ్రీ హనుమాన్ వైశాఖ మాసం దశమి రోజున అలాగే రెండవది శ్రీ ఆంజనేయ స్వామిని సీతా అమ్మవారు చిరంజీవిగా దీవించిన రోజైనా చైత్రమాసం పౌర్ణమి తిథి రోజున హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుపుకుంటారు. శ్రీ ఆంజనేయ స్వామి అంజనీ దేవి కేశవ పుత్రుడు. వాయుదేవుని అంశతో జన్మించిన వారు. శ్రీ ఆంజనేయ స్వామి కార్యసాధకుడు. అసాధ్యమైన సీతాదేవి అన్వేషణను సుసాధ్యం చేసిన మహాబలుడు. శ్రీ రామచంద్ర గారికి సీతా అమ్మవారి జాడను నిర్దేశించినవారు. సప్త చిరంజీవులలో ఒకరు. అలాగే పిలిస్తే పలికే భగవంతుడు. మానవులు దయనందిన జీవితంలో ఎదుర్కొనే సంకటాలను ఎడబాపే భగవంతుడు. లింగ బేధము భాషా బేధము లేకుండా దేశంలో అందరితో పూజించబడే శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రతి గ్రామంలోనూ ఉండడం విశేషం. తంత్ర శాస్త్రంలో శ్రీ హనువమాన్ పూజా విధానం గురించి వివరించబడింది. ఈ పూజను భక్తులు ఎవరైనా న్యాయబద్ధమైన నిజమైన కోరికలు ఏవైనా శ్రీ ఆంజనేయస్వామి నెరవేరుస్తారు. ఈ పూజను శనివారం, మంగళవారాల్లో గాని రాముని నక్షత్రమైన పునర్వసు తిథి రోజున గాని, శ్రీ ఆంజనేయ స్వామి జన్మించిన దశమి తిథి రోజున కానీ ప్రారంభించాలని చెప్పబడింది. చాలా సులభమైన ఈ పూజా విధానాన్ని భక్తులు ఎవరైనా నిర్వహించవచ్చు. 41 రోజుల పాటు రోజు ఒక మినపగింజను స్వామివారి శిరస్సుపై గాని పాదాల వద్ద గాని



ధ్వజస్తంభం వద్ద కానీ సమర్పించి ఓం హం హనుమదే నమః అని కానీ శ్రీరామ నామ జపాన్ని స్మరిస్తూ 11 ప్రదక్షిణలు చేయవలెను. తదుపరి మరొక్క 41 దినములు చేసిన పిదప ఆ మినప గింజలను నదిలో నిమజ్జనం చేస్తే సకల కోరికలు నెరవేరుతాయని శాస్త్రంలో చెప్పబడింది.

ఆలయాల్లో ఆంజనేయస్వామికి ఘనంగా పూజలు : మంథని పట్టణంలోని తమ్మి చెరువు కట్ట, రావుల చెరువు కట్ట, పెంజేరు కట్ట, వాగు గడ్డ, బోయినిపేట గ్రామంలో గల శ్రీ బలవీర హనుమాన్, గోదావరి నది తీరంలో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తన్మయత్వం చెందారు. ఉదయం నాలుగు గంటల నుండి స్వామి వారి దర్శనం కొరకు భక్తుల రావడంతో దేవాలయాల వద్ద పండుగ వాతావరణ నెలకొంది.

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

**- రూ.16,70,000 విలువ కలిగిన చెక్కులను లబ్దిదారులకు పంపిణి**

**- పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధిమే 22: త్వరలో జరగనున్న స్థానిక జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని, ప్రజల్లో మంచితనం ఉన్నవారికే అవకాశాలు ఉంటాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట మండల కేంద్రంలోని ఎస్వీకేకే వేడుకల మందిరంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి నుండి పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారని గుర్తుచేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెన్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోంది: పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. ఈరోజు శాయంపేట లో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 37 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.16,70,000 విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల



జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఆపదలో సీఎం సహాయనిధి ఆపద్బాంధులా ఆదుకుంటుందని తెలిపారు. మానవతా దృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అంబేద్కర్ సెంటర్ వరకు జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర: శాయంపేటలో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం ఫంక్షన్ హాల్ నుండి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో వందలాది మంది కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడాబాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమాలల్లో అన్ని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# ఆపరేషన్ సిందూర్ వేళ పాకు దుస్సాహసం

## ఉగ్రమూకలను భారత్‌లోకి జొప్పించే యత్నం

## తిప్పికొట్టిన సరిహద్దు బద్రతా దళం

న్యూఢిల్లీ,మే22 : ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ పెద్ద సంఖ్యలో ఉగ్రమూకను భారత్‌లోకి పంపేందుకు పాక్ యత్నించింది. సరిహద్దు వెంబడి భారత్‌లోకి జొప్పించే ప్రయత్నం చేయగా భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. దీంతో ఉగ్రమూకలు భారత్‌లోకి రాకుండా అడ్డుకట్ట పడింది. ఈ విషయాన్ని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ధ్రువీకరించింది. మే 8వ తేదీన 45-50 మంది ఉగ్రవాదులను సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపించేందుకు పాక్ దళాలు తీవ్రంగా యత్నించాయి. ఇందుకోసం భారీగా



షెల్లింగ్ కూడా చేపట్టినట్లు పేర్కొన్నాయి. బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మండ్ ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ.. ‘మా జవాన్లు వారికి తీవ్ర స్థాయిలో నష్టం కలిగించారు. పెద్ద ఎత్తున ఉగ్రవాదులు సరిహద్దులు దాటేందుకు వస్తున్నట్లు మా వద్ద ముందే సమాచారం ఉంది. వారి కోసం కాచుకు కూర్చొని.. గుర్తించగానే దాడులు నిర్వహించాము. ఆ గ్రూపులో దాదాపు 45-50 మంది వరకు ఉన్నారు. వారు మా వైపునకు వచ్చారు. దీంతో అదును చూసి వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాము. మేము ఊహించినట్లే తమ పోస్టుల నుంచి వారు భారీ స్థాయిలో కాల్పులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మేము అత్యంత కచ్చితత్వంతో కాల్పులు జరిపాము. దీంతో వారు తమ పోస్టులను వదిలేసి పలాయనం చిత్తగించారు. దాదాపు గంటన్నరలోనే వారికి మేము బుద్ధి చెప్పాము. వారి బంకర్లు, ఆయుధాలను ధ్వంసం చేశాము. వారు మరోసారి వస్తే పదింతల శక్తితో తిప్పికొట్టేందుకు మా జవాన్లు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బీఎస్ఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలున్నాయి. బీఎస్ఎఫ్‌లోని మహిళా జవాన్లు కూడా పురుషులతో సమానంగా శత్రువులపై పోరాడే బాధ్యతలను నిర్వహించారు. వారిని చూస్తే మాకు గర్వంగా ఉంది‘ అని డీఐజీ వెల్లడించారు. బుధవారం పూంచ్‌లోని బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్ ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్మీ, బీఎస్ఎఫ్ సిబ్బందితో ఆయన భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ వేళ జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ తిప్పికొట్టింది. మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఈ పరిణామాలు చోటుచేసు కొన్నట్లు బీఎస్ఎఫ్ ఎక్స్ పోస్టులో వెల్లడించింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు బీఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి.

## ఇంట్లోనే స్కానింగ్..

# అబార్షన్ వికటించి వివాహిత మృతి

నల్లగొండ: నకిరేకల్ లో ఇంట్లోనే స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేసుకొని స్కానింగ్ తీస్తూ లింగ నిర్ధారణ చేస్తున్న వైనం మరోసారి బయటపడింది. నిందితుడు యాదగిరిపై గతంలో పలు కేసులు నమోదు అయ్యాయి. రెండు రోజుల క్రితం సూర్యాపేట జిల్లా మోతే గ్రామానికి చెందిన అనూష అనే మహిళకు స్కానింగ్ తీసి లింగ నిర్ధారణ చేసాడు యాదగిరి . టేకుమట్ల గ్రామానికి చెందిన ఓ ఆర్ ఎం పి అనూషను యాదగిరి ఇంటికి స్కానింగ్ కోసం తీసుకొచ్చినట్లుగా సమాచారం. అనూష కు ఇప్పటికి ఇద్దరు ఆడపిల్లలు మరోసారి ఆడపిల్ల అని నిర్ధారణ చేయడంతో అబార్షన్ కి అనూష కుటుంబ సభ్యులు సిద్ధపడ్డారు. సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనూషకు అబార్షన్ చేయడంతో తీవ్ర రక్తస్రావం తో మృతి చెందింది. అనూష మృతి చెందిన వార్త తెలుసుకున్న స్కానింగ్ చేసిన యాదగిరి పరారీ అయ్యాడు.

## బస్తీ దవాఖానాల ఏర్పాటుకై

# అధికారుల కుస్తీ


**కొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచుతాం**

**డిఎంహెచ్వో సాంబశివరావు వెల్లడి**




వరంగల్ ప్రతినిధి: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు బస్తీ దవాఖానాల కోసం అధికారులు కుస్తీ పడుతున్నారు వరంగల్ డిఎంహెచ్వో పరిధిలో ఆరు బస్తీ దవాఖానాలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం వరంగల్ పట్టణంలో రెండు బస్తీ దవాఖానాలు పనిచేస్తున్నాయి ప్రతి మూడు వేలకు పైగా జనాభా ఉన్న ఏరియాలలో బస్తీ దవాఖానాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది ఆ క్రమంలో వరంగల్ పట్టణంలోని రెండు ఏరియాలలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారు వరంగల్ జిల్లాలో ఇంకా నాలుగు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అందులో ఒకటి నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేయాల్సి ఉంది నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేయవలసిన బస్తీ దవాఖాన కోసం అక్కడి మున్సిపాలిటీ అధికారులు భవనాన్ని కేటాయించలేదు దానితోపాటుగా వరంగల్ మహానగర పారిట పరిధిలో ఏర్పాటు కావలసిన మొత్తం బస్తీ దవాఖానాల కోసం 9 చోట్ల ప్రతిపాదనలు పంపగా వాటిలో అణువుగా ఉన్నవని గుర్తించి అక్కడ బస్తీతవక్కన ఏర్పాటు చేసి ప్రజలకు కావలసిన వైద్య సౌకర్యాలను అందిస్తున్నట్లు వరంగల్ డిఎంహెచ్ఓ బి సాంబశివరావు తెలిపారు మిగిలిన మూడింటిలో సి ఆర్ నగర్ తోపాటు మరో రెండు ప్రదేశాలను మహానగరపాలక సంస్థ భవనాలను ఇవ్వాల్సి ఉంది వాటిని రానున్న బడ్జెట్లో భవనాలతో పాటు బస్తీ తవాఖాన నిర్వహణకు కావలసిన వసతులను కేటాయించే విధంగా మహానగరపాలక కమిషనర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు బస్తీ దవాఖానాలకు వచ్చేవారి సంఖ్య దినదినం పెరుగుతుందని ప్రజలు బస్తే దవాఖానాల పట్ల ఆకర్షితులై వస్తున్నారని ఆయన తెలిపారు వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న సేవల మాదిరిగానే బస్తీ దవాఖానాలలో అందించడం జరుగుతుందని డిఎంహెచ్వో తెలిపారు వివిధ రకాల పరీక్షలతో పాటు రోగులకు అందుబాటులో ఉండే విధంగా సిబ్బందిని ఉంచడం జరుగుతుందని అన్నారు మిగిలిన నాలుగు బస్తీ దవాఖానాలను మహానగరపాలక సంస్థ ఇచ్చే వసతులు ఆధారంగా ప్రజలకు అందుబాటులో ఉంచి వైద్య సేవలను అందిస్తామని డిఎన్హెచ్ఓ సాంబశివరావు తెలిపారు ఇదిలా ఉండగా బస్తీ దవాఖానాలకు వస్తున్న రోగులకు కావలసిన మందులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ను తనిఖీ చేస్తున్న విధంగానే బస్తీ దవాఖానాలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నావా లేవా అన్న విషయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు

# కొండగట్టు ఆంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయరమణా రావు



పెద్దపల్లి ప్రతినిధి: పెద్ద హనుమాన్ జన్మదినం పురస్కరించుకొని జగిత్యాలలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని గురువారం ఎమ్మెల్యే చింత కుంట విజయరమణ రావు దర్శించుకున్నారు. దేవస్థానం లో ప్రత్యేక పూజలు నిర్వహిం చిన ఎమ్మెల్యే అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వాదించా రు. ఈ కార్యక్రమంలో సుల్తానా బాద్ మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, దుగ్యల సంతోష్ రావు, సుల్తానాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీష్, పోల్సని సునీల్ రావు, పెద్దపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం టీచర్ పోస్టులు



విజయవాడ, మే 22,: పాఠశాల విద్యా శాఖకు సంబంధించి 2,260 టీచర్ పోస్టుల కల్పనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. నెం. 132/2016 లో భారత సర్వోన్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులకు అనుగుణంగా 1136-1124 పాఠశాల సహాయకుల పోస్టులు మొత్తం 2,260 ఖాళీగా ఉన్న అదనపు పోస్టు లుగా మార్చుతూ ఏప్రిల్ 15న పాఠశాల విద్యా శాఖ జారీ చేసిన నెం. 13 ను దృవీకరించేందుకు చేసిన ప్రతిపాదనకు ఏపీ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు విద్యావకాశాలను పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక విద్యా ఉపాధ్యాయు ల కోసం 2,260 కొత్త పోస్టుల కల్పనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మేధోపరమైన వైకల్యాలు, ప్రత్యేక అభ్యాస వైకల్యాలు వంటి పరిస్థితులు ఉన్న వ్యక్తులకు తగిన విద్యాపరమైన మద్దతును అందించడమే దీని లక్ష్యమని మంత్రి మండలి భావించింది. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల విద్యా హక్కులను పునరుద్ధ రించడంలో, విద్యా వ్యవస్థలో సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ఇది కీలకమైన దశ.ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వివిధ కేటగిరీలలో 245 పోస్టుల కల్పనకు న్యాయ శాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. జిల్లా జడ్జి కేడర్లో రిజిస్ట్రార్ (జ్యుడీషియల్. ఎఐ), రిజిస్ట్రార్ (న్యాప్ట్రక్చర్), ఎడిటర్, జాయింట్ రిజిస్ట్రార్లు, డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సెక్షన్ ఆఫీసర్లు, కోర్ట్ ఆఫీసర్లు, స్క్రూటినీ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నారువాటితో పాటు అకౌంట్స్ ఆఫీసర్, డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్/ట్రాన్స్‌లేటర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్, అప్పల్ డివిజన్ స్టెనో, అసిస్టెంట్లు, ఎగ్జామినర్లు, టైపిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కాపియర్ మెషిన్ ఆపరేటర్లు, సీనియర్ సిస్టమ్ ఆఫీసర్, సిస్టమ్ ఆఫీసర్, సిస్టమ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్లు, ప్రాజెక్ట్ లీడర్/ప్రాజెక్ట్ హెడ్, మాడ్యూల్ లీడర్లు/ యూజర్ ఇంటర్ఫేస్(ఐఎ) వెబ్ డిజైనర్ల అదనపు పోస్టులకు అనుమతిని మంజూరు చేయాలని ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వివిధ కేటగిరీలలో రెండు నలభై ఐదు (245) పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# మహిళల రక్షణకు సఖీ కేంద్రాల ద్వారా సేవలు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి: హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రంగంపల్లి లోని సఖీ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా రిలీఫ్ రావాలని, ఇటువంటి కేసుల పై అధిక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. సఖీ సెంటర్ కు వచ్చిన మహిళల సమస్య పరిష్కారానికి కృషి చేసి వారిని రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపా రు. సఖి సెంటర్ కు వచ్చే బాధితులకు అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని, వివిధ కేసులలో అవసరమైన సందర్భంలో న్యాయ సలహా సైతం అందించాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని లో ఒక మహిళను, ఆమె పిల్లలను 3 సంవత్సరాల పాటు అక్రమంగా నిర్బంధించిన మెస్త్రీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గోదావరిఖని ఏసిపిని ఆదేశించారు. ప్రస్తుతం



ప్రతినెల దాదాపు 20 మంది మహిళలు సఖి సెంటర్ ను ఆశ్రయిస్తున్నారని , గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ సఖీ సెంటర్ ద్వారా అందించే సేవల గురించి ప్రచారం కల్పించి, సఖి సెంటర్ కు వచ్చే బాధితుల సంఖ్య పెంచాలని కలెక్టర్ అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వేగంగా అభివృద్ధి పనులు

**ప్రభుత్వం సహకరిస్తే..మరింత త్వరగా పూర్తి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**బేగంపేట అంతర్జాతీయ విమానాశ్రయంగా ఉందన్న కోమటిరెడ్డి**

హైదరాబాద్,మే22: తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు.'తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేస్తే, మాజీ సిఎం కెసిఆర్ కనీసం రాలేదని విమర్శించారు. విప్లవాత్మకమైన అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని అన్నారు. ఇప్పటికే చర్లపల్లి రైల్వేస్టేషన్ ను ప్రారంభించుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రోచ్ రోడ్ కు భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఎంత వేగంగా సహకరిస్తే, అంతకంటే వేగంగా కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అమృత్ భారత్' పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను భారత




ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ జాబితాలో బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సూళ్లూరు పేట స్టేషన్‌లు ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి చూస్తున్న బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, భవిష్యత్‌లో మరిన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసికట్టుగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. గట్కేసర్ నుండి యాదాద్రి వరకు భక్తుల కోసం ఎంఎంటీఎస్ సర్వీస్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ రైల్వే మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఘట్ కేసర్ ? యాదాద్రి మార్గాన్ని ఆరు నెలల్లో పూర్తిచేయాలన్న దిశగా ప్రయత్నిస్తున్నామని, దీనిపై సీఎం తో చర్చించి త్వరిత క్లియరెన్స్‌కి సహకరిస్తానని తెలిపారు.

# డీఎడ్ కోర్సుకు మళ్లీ పూర్వ వైభవం

నిజామాబాద్, మే 22,: డీఎడ్ కోర్సుకు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. ఈ కోర్సు పూర్తి చేసిన వారు తక్కువగా ఉండటం, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టు లు ఎక్కువగా ఉండటంతో ఎక్కువ మంది అభ్యర్థులు అటువైపుగా ఆసక్తి చూపుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను 70% ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయడం, 30% మాత్రమే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయడంతో ప్రతీ డీఎస్సీలోనూ ఎస్జీటీ ఖాళీలు ఎక్కువ గా ఉంటున్నాయి.తాజాగా 2024లో ప్రభుత్వం 11వేలకు పైచిలుకు టీచర్ పోస్టులను భర్తీ చేయగా, అందులో 7 వేలకు పైగా ఎస్జీటీ పోస్టులే ఉండ టం గమనార్హం. ఈ నేపథ్యంలో డీఈడీ కోర్సుకు డిమాండ్ పెరిగింది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీఎడ్) కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించే డీఈఈసెట్ పరీక్ష ఈ నెల 25న జరగనుంది.ఈ అర్హత పరీక్షకు ఈ ఏడాది ఏకంగా 43,616 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. 2024లో 17,656 దరఖాస్తులు రా గా, 2023లో మరీ తక్కువగా 6,486 దరఖాస్తులే వచ్చా యి. కానీ 2024లో అత్యధిక మంది చిన్న వయసులో టీచర్ ఉద్యోగాలు సాధించడంతో ఈసారి అభ్యర్థుల నుంచి భారీ స్థాయిలో అర్జీలు వచ్చాయి. ఒకప్పుడు డీఈడీ కోర్సుకు ఫుల్ డిమాండ్ ఉండేది.2012 సమయంలోనే మేనేజ్‌మెంట్ సీటు ధర రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పలికేది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైమ రీ తరగతులకు బోధించాలంటే డీఎడ్ చేసి ఉండాల్సిందే. ఆపై తరగతులకు బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు బీఎడ్ అర్హత ఉండాలి. కానీ, 2018లో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్‌తోపాటు, బీఎడ్ అభ్యర్థులూ అర్హులేన ని జాతీయ ఉపాధ్యాయ మండలి ఆదేశాలు జారీ చేసింది.దీనికి తోడు డీఎస్సీ నోటిఫికేషన్లు రాకపోవడంతో డీఈడ్‌కు డిమాండ్ తగ్గింది. అయితే ఎస్జీటీ పోస్టులకు కేవలం డీఎడ్ అభ్యర్థులే అర్హులంటూ 2023లో సుప్రీంకోర్టు తీర్పునివ్వడం, గతేడాది నిర్వహించిన డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులే ఎక్కువగా ఉండటం, ఒక్కో పోస్టుకు పోటీ పడుతున్న వారి సంఖ్య సైతం తక్కువగా ఉండటంతో ఈసారి ఈ కోర్సుకు మళ్లీ డిమాండ్ పెరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులతో వేసిన డీఎస్సీలో దాదాపు ఏడు వేల వరకు ఎస్జీటీ పోస్టులుంటే వాటికి పోటీ పడింది 60 వేల మంది అభ్యర్థులే. మొన్నటి డీఎస్సీలో దాదాపు 30 జిల్లాల్లో వందకు పైగా ఎస్జీటీ ఖాళీలున్నాయి. అదే ఎస్ఏ పోస్టులు మాత్రం సింగిల్ డిజిట్‌లోనే ఉన్నాయి. క్యాటగిరీ వారీగా వచ్చేసరికి ఎస్జీటీ పోస్టులకు ఒక్క పోస్టుకు నలుగురు, ఐదుగురు మా త్రమే పోటీ ఉండేది.కానీ, ఎస్ఏ పోస్టులకు మాత్రం అభ్యర్థుల మధ్య పోటీ ఉంటుంది. కొన్ని జిల్లాల్లో క్యాటగిరీల్లో ఎస్ఏ పోస్టులే లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలోనే త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో డీఈఈసెట్ ఎంట్రెన్స్ రాసి డీఎడ్ చేసిఉంటే ఎస్జీటీ ఉద్యోగాన్ని సాధించవచ్చన్న ఆలోచనలో అభ్యర్థులున్నారు. అంతేకాకుండా బీఎడ్ చేసిన ఉన్నవారు కూడా ఈసారి డీఈఈసెట్‌కు దరఖాస్తు చేసుకోవటం గమనార్హం.బీఎడ్ చేసి ఎస్ఏ పోస్టు కొట్టడం కంటే, డీఎడ్ చేసి ఎస్జీటీ కొలువు సాధించడం సులువని అభ్యర్థులు భావిస్తున్నారు. ఈక్రమంలోనే ఈసారి భారీగా దరఖాస్తు లు చేశారు. డీఎడ్‌కు గత కొంతకాలంగా డిమాండ్ పడిపోవడంతో రాష్ట్రంలోని పలు ప్రైవేట్ డీఎడ్ కాలేజీలు మూత బడ్డాయి.ఒకప్పుడు 220 డీఎడ్ కాలేజీలుంటే ప్రస్తుతం వాటి సంఖ్య 80కి తగ్గింది. గతంలో దాదాపు 11,500 వర కు సీట్లు అందుబాటులో ఉండగా, ఇప్పుడు 4 వేలకు పడిపోయింది. డీఎడ్‌కు మళ్లీ పూర్వవైభవం రావటంతో కాలే జీల యాజమాన్యాలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

# అమృత ఫలం.. ఐస్ ఆపిల్!



తాటి ముంజలు.. ఎండకాలంలో మాత్రమే లభించే అమృత ఫలాలు. చూసేందుకు తెల్లని మంచు ముద్దలా నోట్లో వేసుకుంటే కరిగిపోయే వీటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎన్నో పోషకాలు, విటమిన్లతో నిండిన ఈ పండ్లు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తాయి. తాటి ముంజల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ,యాంటిబ్యాక్టీరియల్, యాంటి క్యాన్సర్, యాంటి డయాబెటిక్ లక్షణాలుఅధికం. ఇవి..వివిధ వ్యాధు లను దరిచేరనీయకుండా.. మన ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాయి. తాటిముంజల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి, వేసవిలో డీహైడ్రేషన్‌ను సమర్థంగా నివారిస్తాయి. వడదెబ్బకు గురైనవారికి తక్షణ ఉపశమనం అందిస్తాయి. శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెర పదార్థాలను సమతుల్యం చేస్తాయి. శరీరాన్ని చల్లబరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచడంలోనూ సహాయపడతాయి. ఇందులో అధికంగా లభించే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇక తక్కువ కేలరీలతో కూడిన తాటిముంజలు బరువు తగ్గడంలోనూ సాయపడతాయి. ముంజల్లో లభించే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటివి శరీరంలో వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేస్తాయి. వీటిని తాటి ముంజలు నిర్మూలిస్తాయని పలు పరిశోధనల్లో తేలింది. అందుకే, ఐస్ యాపిల్స్‌ను రెగ్యులర్‌గా తినేవారు.. వివిధ క్యాన్సర్ల బారిన పడకుండా ఉంటారని పరిశోధకులు చెబుతున్నారు. ఇక ఇందులోని పొటాషియం.. కాలేయ సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది. ఇక చాలామంది గర్భిణులు మలబద్ధకం, అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటివాళ్లు తాటిముంజలను తీసుకుంటే.. వారి జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అసిడిటీ, మలబద్ధకం తగ్గుముఖం పడతాయి. ఎండల్లో తిరగడం వల్ల ముఖంపై వచ్చే చిన్నచిన్న మొటిమల్లాంటి పొక్కులను తాటి ముంజలు సమర్థంగా అడ్డుకుంటాయి. అయితే, కొందరు ముంజలపై గోధుమ రంగులో ఉండే పొట్టును తీసేసి.. కేవలం తెల్లటి పదార్థాన్ని మాత్రమే తింటారు. కానీ, ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయని, అది ఆరోగ్యానికి మరింత మంచిదంటున్నారు నిపుణులు.

# ఈ పొరబాట్లు చేయకండి..



చాలా మందికి టీ అనేది కేవలం ఒక పానీయం కాదు, ఒక అనుభూ తి. రోజూ ఎంతో ఆసక్తిగా తాగే ఈ టీలో చేసే కొన్ని సాధారణ తప్పులు మన ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. టీని సరిగ్గా తాగకపోవడం శరీరానికి హానికరం. టీని తరచుగా తాగడం వల్ల, ఖాళీ కడుపుతో తాగడం వల్ల, లేదా ఎక్కువ టీ ఆకులను జోడించడం వల్ల టీ తాగే అలవాటు క్రమంగా శరీరానికి హాని కలిగిస్తుంది. టీ తాగేటప్పుడు ఈ తప్పులు అసలు చేయొద్దని నిపుణులు చెబుతున్నారు.

ఖాళీ కడుపుతో టీ తాగడం : కొంతమంది ఉదయం నిద్రలేచిన వెంటనే టీ తాగుతారు.. ఇది హానికరం. ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల అసిడిటీ సమస్యలు వస్తాయి. ఇది గ్యాస్, బర్నింగ్ సెన్సేషన్, మలబద్ధకం వంటి సమస్యలను కలిగిస్తుంది. కనుక టీ తాగే ముందు గోరువెచ్చని నీరు తాగాలి.

ఎక్కువ సార్లు : టీ ప్రియులు రోజుకు 4, 5 సార్లు లేదా అంతకంటే ఎక్కువ సార్లు టీ తాగుతారు. ఇలా చేయడం వల్ల శరీరంలో కెఫిన్ పరిమాణం పెరుగు తుంది. దీని వలన నిద్ర లేకపోవడం, భయం, అలసట కలుగుతుంది. అందువల్ల రోజుకు 2 కప్పుల కంటే ఎక్కువ తాగకూడదు. రాత్రి కూడా ఆలస్యంగా టీ తాగకూడదు.

ఘాటైన రుచి : ఘాటైన లేదా బాగా మరిగించిన టీని కొంతమంది ఇష్టపడతారు. ఇలా చేయడం వల్ల టానిన్, కెఫిన్ స్థాయిలు పెరుగుతాయి. ఇవి జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తాయి. కాబట్టి టీని ఎక్కువగా మరిగించి.. చాలా చిక్కగా చేయకూడదు.

భోజనం తిన్న వెంటనే : భోజనం చేసిన వెంటనే కొంతమందికి టీ తాగే అలవాటు ఉంటుంది. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. భోజనం చేసిన వెంటనే టీ తాగడం వల్ల ఆహారంలో ఉండే ఐరెన్, పోషకాల శోషణ తగ్గుతుంది. టీ తాగాలనుకుంటే భోజనం చేసిన తర్వాత 30-45 నిమిషాల తర్వాత మాత్రమే తాగాలి.

తీపి టీ : ఎక్కువ చక్కెర జోడించిన తీపి టీ కొంతమంది ఇష్టపడతారు. దీంతో టీలో అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెరను కలుపుకుంటారు. అయితే అతిగా తీపి టీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి, ఊబకాయం, మధుమేహం సమస్యలు వస్తాయి. వీలైతే టీలో చక్కెరను తగ్గించాలి లేదా బెల్లంని ఉపయోగించాలి.

# నోటి దుర్వాసనకు గ్లిజరిన్‌తో చెక్

కన్నీళ్లు కార్చడం కోసం నటులు గ్లిజరిన్ ఉపయోగిస్తారని తెలిసిందే. అదే గ్లిజరిన్ నవ్వులు కూడా తెప్పిస్తుందని తెలుసా? చాలామంది నవ్వలేక ఏడుస్తారు. నవ్వితే నోటి దుర్వాసనతో ఎదుటివాళ్లు ఏమను కుంటారోనని నవ్వలేరు. నవ్వు ఆపుకోలేక నవ్వితే ఎదుటివాళ్లు నవ్వా రని ఏడుస్తారు. ఇలాంటి సంకట స్థితిలో ఆ దుర్వాసనకు విరుగుడు గ్లిజరిన్. నోటి దుర్వాసనతో దీర్ఘకాలంగా బాధపడుతున్న వారికే కాదు వెల్లుల్లి, ఉల్లి తిన్నతర్వాత కూడా నోటి దుర్వాసన వస్తుంది. %ఈ రెండు రకాల దుర్వాసనలకు గ్లిజరిన్ చెక్ పెట్టేస్తుంది. గోరువె చ్చని నీటిలో గ్లిజరిన్ (గ్లిజరాల్) కలిపి కాసేపు పుక్కిలిస్తే దుర్వాసన మాయమైపోతుందట. ఉల్లి, వెల్లుల్లిలో గంధకం (సల్ఫర్) సమ్మేళనాలు ఉంటాయి. ఈ సమ్మేళనాలు అమైనో ఆమ్లాలు, ఇతర ఆమ్లాలుగా మారతాయి. నోటి దుర్వాసన రావడానికి కారణం ఇవే. గ్లిజరిన్‌తో నోటిని తడపడం వల్ల నోట్లో బ్యాక్టీరియా పెరుగుదల ఆగిపోతుంది.

చిగుళ్ల ఆరోగ్యం మెరుగవుతుంది. చిగుళ్ల సమస్యలు, నోటి



దుర్వాసన ఉంటే గ్లిజరిన్‌తో చేసిన మౌత్‌వాష్‌లు, టూత్‌పేస్టులు కూడా మార్కెట్లో ఉన్నాయి. అయితే, నోటి దుర్వాసన పోగొట్టే ప్రయత్నంలో గ్లిజరిన్ గొంతులోకి పోకుండా చూసుకోవాలి. లేదంటే వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, గొంతులో మంట వంటి సమస్యలు వస్తాయి.

# ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా



ర్షాల్లో తేమ, నీటి కాలుష్యం వల్ల బ్యాక్టీరియా, కీటకాలు తయారవుతా యి. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. దగ్గు, జలుబు, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు కూడా తలెత్తుతాయి. వీటి బారిన పడకుండా ఇంట్లోనే చిన్న చిట్కాలతో బయటపడవచ్చు. అవేంటో చూద్దాం.తులసి : తులసిలో యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. తులసి ఆకులను తినడం కానీ.. తులసి టీని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. ఇంకా ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది.

అల్లం : అల్లంలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనాన్ని అందిస్తాయి. అల్లం టీ తీసుకోవడం లేదా ఆహారంలో అల్లం భాగం చేసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది.వెల్లుల్లి : వెల్లుల్లిలో యాంటీమైక్రోబయల్, రోగనిరోధక శక్తిని పెంచే అల్లిసిన్లో సమృద్ధిగా ఉంటుంది. పచ్చి వెల్లుల్లిని తీసుకోవడం వంటలో భాగం చేసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్‌లను నివారించవచ్చు. వెల్లుల్లితో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించవచ్చు. దీంతో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

వేప : వేపలో యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్ లక్షణాలు ఉంటాయి. వేప ఆకులు లేదా వేప ఆధారిత ఉత్పత్తులను తీసుకోవడం వల్ల రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అలాగే మలేరియా, డెంగ్యూ, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఉండవచ్చు.

# దీపిక గొంతెమ్మ కోరికలు..



డార్లింగ్ ప్రభాస్ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని అలరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఖాతాలో అరడజనుకి పైగా ప్రాజెక్టులు ఉన్నాయి. మారుతితో రాజా సాబ్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలు ఫినిష్ అయ్యాక సందీప్ రెడ్డితో 'స్పిరిట్' చిత్రం చేయనున్నారు. ఈ మూవీ పూర్తి అయ్యాక త నాగ్ అశ్విన్ తో కల్కి 2 , ప్రశాంత్ నీల్‌తో సలార్ 2.. అలానే యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో ఒక సినిమా చేయనున్నట్టు సమాచారం. అయితే ఈ ప్రాజెక్ట్‌లో సందీప్ రెడ్డి వంగాతో చేయనున్న ప్రాజెక్ట్‌పై అంచనా లు భారీగా ఉన్నాయి. ఈ చిత్రాన్ని సందీప్ ఏ జానర్‌లో తెరకెక్కిస్తాడా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్టు సమాచారం. ఇక ప్రభాస్‌కి జోడీగా దీపిక పదుకొనేని తీసుకోవాలని సందీప్ అనుకున్నాడట. అయితే ఆమె డిమాండ్లు కళ్లు భైర్లు కమ్మేలా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. సందీప్ వంగా దర్శకత్వం వహించనున్న స్పిరిట్ కోసం దీపికని సంప్రదించగా, ఆమె భారీ పారితోషికంతో పాటు, పెద్దమొత్తంలో షేర్ ని డిమాండ్ చేసిందని, పైగా 8 గంటలు మాత్రమే పనికి కేటాయిస్తానని కండీషన్స్ కూడా పెట్టిందని సమాచారం. అయితే ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే.. ఆమె ఇచ్చిన ఎనిమిది గంటలలో రెండు గంటలు జర్నీకే సరిపోతే మిగిలిన ఆరు గంటలు మాత్రమే సెట్స్‌లో ఉంటుంది. దీపిక కండీషన్స్‌కి బాగా హర్ట్ అయిన సందీప్ రెడ్డి వంగా కొత్త హీరోయిన్‌ని వెతికే పనిలో ఉన్నాడట. నిజానికి ప్రభాస్– దీపిక కాంబినేషన్ కుదిరితే స్పిరిట్ బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొడుతుందని అంతా అనుకున్నారు. కాని దీపిక ఇటీవల పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెతో ఎక్కువ సమయం గడపాలని దీపిక అనుకుంటుంది. అందుకే టైం విషయంలో అంత స్ట్రిక్ట్‌గా కండీషన్స్ పెడుతుందని అంటున్నారు. మరి ప్రస్తుతం దీపికకి సంబంధించి జరుగుతున్న ప్రచారాలలో వాస్తవం ఏంటన్నది తెలియాల్సి ఉంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం దీపిక స్థానంలో అనుష్కని తీసుకోవాలని భావిస్తున్నట్టు టాక్




# కేన్స్‌లో సిందూర్‌తో ఎలివేషన్ ఇచ్చిన ఐశ్వర్యరాయ్..






పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులైన 26 మంది పర్యాటకులని కాల్చి చంపిన విషయం తెలిసిందే. అయితే అక్కాచెల్లెమ్మల సిందూరం తుడిచేసిన ఉగ్రవాదుల గడ్డపై రక్త సిందూరం పారించేందుకే ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేసింది. పాకిస్తాన్‌తో పాటు పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని భారత్ క్షిపణులతో విరుచుకుపడింది. మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన ఈ మిషన్‌కి మంచి సపోర్ట్ లభించింది. చాలా మంది సెలబ్రిటీలు కూడా ఈ ఆపరేషన్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. అయితే మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ తాజాగా తన సిందూర్‌ను ప్రత్యేకంగా ప్రదర్శించడం చర్చనీయాంశం అయింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఐష్ కేన్స్‌లో తన సిందూర్‌ని హైలైట్ చేయడంపై నెటిజన్స్ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఇండియా– పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో సిందూర్ ఆపరేషన్ ప్రత్యేకతను గుర్తు చేయడానికే ఐష్ ఇలా రెడీ అయ్యారని కొందరు విశ్లేషిస్తున్నారు. భారతీయత ఉట్టిపడేలా తెలుపు రంగు చీర, టిష్యూ డ్రేప్, మెడలో ముత్యాల హారాలు, మెరిసే సిందూరం..ఇలా సంప్రదాయబద్ధంగా కేన్స్‌లో రెడ్ కార్పెట్‌పై సందడి చేసింది ఐశ్వర్యరాయ్. 51 ఏళ్ల ఐశ్వర్యారాయ్ కోసం మనీష్ మల్హోత్రా చాలా శ్రమించి ఈ డిజైనర్ శారీని రెడీ చేసినట్టు తెలుస్తుంది. ఐష్ ఈ బనారసీ చీరలో తన దేశీగాళ్ లుక్‌ని ప్రదర్శించి అందరి మన్ననలు అందుకుంటుంది. గత కొద్ది నెలలుగా ఐశ్వర్యరాయ్– అభిషేక్ బచ్చన్ విడాకులకి సంబంధించి కూడా జోరుగా ప్రచారాలు సాగుతున్నాయి. వాటన్నింటికి కూడా చెక్ పెట్టడానికి ఐష్ తన సిందూరాన్ని హైలైట్ చేసిందని కొందరు అంటున్నారు. ఆమెకి తన భర్త పట్ల ఉన్న ప్రేమ, నిబద్ధతని తెలియజేసేందుకు అలా వచ్చిందని, అభిషేక్‌పై తన ప్రేమని ప్రపంచానికి మొత్తం తెలియజేసిందని కొందరి కామెంట్. ఈ లుక్ లో ఐశ్వర్య రాయ్ మహా రాణిలా కనిపిస్తోంది. నెటిజన్లు ఆమె అప్పీయరెన్స్, కేన్స్ ఫోటోలపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. 51 ఏళ్ల వయస్సులోను ఇంత గ్లామర్ ఎలా మెయింటైన్ చేస్తున్నావు అని అంటున్నారు. ఒక యూజర్ "చాలా కాలం తర్వాత నిన్ను చీరలో చూశాను, నువ్వు చాలా బాగున్నావు" అని రాసుకొచ్చారు. ఏది ఏమైన ఐష్ ఫోటోలు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తున్నాయి.

# కల్లబొల్లి గుండె కన్నుమీటుతుందే..




తమిళ సోయగం త్రిష సెకండ్ ఇన్నింగ్స్ సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతున్నది. ముఖ్యంగా 'పొన్నియన్ సెల్వన్' సిరీస్ చిత్రాలతో ఈ భామ దశ తిరిగింది. అక్కడి నుంచి వరుసగా అన్నీ విజయాలే వరిస్తున్నాయి. ఆమె కమల్‌హాసన్ సరసన కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'థగ్‌లైఫ్' జూన్ 5న విడుదలకు సిద్ధమవుతున్నది. అగ్ర దర్శకుడు మణిరత్నం రూపొందిస్తున్న ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా నుంచి 'షుగర్ బేబీ' అనే పాటను విడుదల చేశారు. ఏ.ఆర్.రెహమాన్ స్వరపరచిన ఈ పాటను అనంతశ్రీరామ్ రచించారు. 'ఏం కావాలి నీకు, కొద్దికొద్దిగడుగు, ఇంకేం కావాలి నీకు, స్వర్గం తేనా ఇలకు, కల్లబొల్లి గుండె కన్నుమీటుతుందే..షుగర్ బేబీ' అంటూ సాఫ్ట్ అండ్ మెలోడీ బీట్‌తో ఈ పాట సాగింది. త్రిష తన అందచందాలతో మెస్మరైజ్ చేసింది. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ చిత్రంలో కమల్‌హాసన్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో శ్రేష్ఠమూవీస్ పతాకంపై ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

# శరవేగంగా రామ్‌చరణ్ పెద్ది షూటింగ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా డైరెక్షన్‌లో రూపొందు తున్న భారీ చిత్రం 'పెద్ది' సినిమా షూటింగ్ జోరందుకుంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాన్–ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.




'పెద్ది' సినిమా కోసం హైదరాబాద్ శివారులోని శంకర్ పల్లిలో ఒక భారీ గ్రామీణ సెట్‌ను నిర్మించారు. ఈ సెట్‌లో ప్రస్తుతం కీలక షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ఒక హై–ఆక్టేన్ యాక్షన్ సీన్‌తో పాటు కొంత టాకీ భాగం చిత్రీకరణ జరగనుందని సమాచారం. ఈ సెట్‌లో గ్రామీణ వాతావరణాన్ని అత్యంత సహజంగా రీక్రియేట్ చేసినట్లు తెలుస్తోంది, ఇది సినిమాకు ఒక ప్రత్యేకమైన ఆకర్షణను జోడిస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. తాజాగా, సినిమా టీం సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ చిత్రాల్లో రామ్ చరణ్‌తో పాటు దర్శకుడు బుచ్చిబాబు సానా, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ (మున్నాభాయ్ ఫేమ్) కలిసి కనిపించారు. దివ్యేందు శర్మ ఈ సినిమాతో తెలుగు సినిమాలోకి అడుగుపెడుతున్నారు, ఇది ఆయనకు తొలి తెలుగు చిత్రం కావడం గమనార్హం. 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌తో పాటు కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు, ఇది సినిమాకు మరో పెద్ద ఆకర్షణగా నిలుస్తోంది. సినిమాటోగ్రఫీని ఆర్. రత్నవేలు, ఎడిటింగ్‌ను నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాశ్ కొల్లా నిర్వహిస్తున్నారు. 'పెద్ది' ఒక రస్టిక్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ సినిమా 1980ల నాటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నేపథ్యంలో సాగుతూ, క్రీడల ద్వారా సమాజాన్ని ఏకం చేసే ఒక యువకుడి కథను చెబుతుందని తెలుస్తోంది. రామ్ చరణ్ ఈ చిత్రంలో క్రికెటర్‌గా కనిపించనున్నారు, ఆయన రగ్గడ్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమా కోసం రామ్ చరణ్ ఆస్ట్రేలియాలో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నట్లు సమాచారం.

# 32 ఏళ్ల తర్వాత బాలకృష్ణ సినిమాలో విజయశాంతి?



ఒకప్పటి హిట్ పెయిర్ బాలకృష్ణ, విజయశాంతి మళ్లీ వెండితెరపై సందడి చేయనున్నారనే వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు 32 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరూ కలిసి నటించబోతున్నారని, అది కూడా బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ–2'లో అని గట్టిగా వినిపిస్తోంది. ఈ వార్త నిజమైతే అభిమానులకు పండగే అని చెప్పాలి. గతంలో బాలకృష్ణ, విజయశాంతి జోడీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. 'కథానాయకుడు' సినిమాతో మొదలైన వీరి ప్రయాణం, 'ముద్దుల క్రిష్ణయ్య', 'ముద్దుల మావయ్య' వంటి గోల్డెన్ జూబ్లీ చిత్రాలతో పాటు 'లారీ డ్రైవర్', 'రౌడీ ఇన్స్‌పెక్టర్' వంటి అనేక సూపర్ హిట్ చిత్రాల వరకు సాగింది. వీరిద్దరూ కలిసి దాదాపు 16 సినిమాల్లో నటించి, తెలుగు సినిమా చరిత్రలో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చివరిసారిగా 1993లో వచ్చిన 'నిప్పురవ్వ' చిత్రంలో ఈ జంట కనిపించింది. ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ' సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ–2' తెరకెక్కుతోంది. ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులో విజయశాంతి ఓ కీలక పాత్ర పోషించనున్నారని వార్తలు వస్తున్నాయి. అయితే, దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ వార్తలు నిజమై, వీరిద్దరూ మళ్లీ కలిసి నటిస్తే, సినిమాపై అంచనాలు మరింత పెరగడం ఖాయం.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem (Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.